క్లుప్తంగా

శేషవాహనంపై ఊరేగిన పాండురంగడు



కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు శేషవాహనంపై ఊరేగాడు. ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు పంచామృతాభిషేకం, మహాగణపతి పూజ, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, సంప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి పాండురంగడు శేష వాహనంపై కొలువుదీరగా పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం నుంచి గాంధీసెంటర్ వరకు గ్రామోత్సవం కొనసాగింది. గురువారం పాండురంగ విఠలేశ్వరుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శన మిస్తారని ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధతో తిరునక్షత్ర వేడుకలు

డోన్ టౌన్ : స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తిరునక్షత్రం పురస్కరించుకొని నమ్మల్వార్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో గోష్టి సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి తిరుమంజనం,అష్టోత్తర శతనామావళి పూజ, తిరువాయిముజీ పారాయణం, మహా ప్రసాద వివేదన, మంగళహారతి తదితర కైకంర్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సభ్యురాలు రజనీకుమారీ, ఉషారాణి, గోష్టి మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ప్యాపిలి: ప్రభుత్వం పంపిణీ చేసే సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం ఆసక్తి ఉన్న రైతులు గురువారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి రాజేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కదిరి లేపాక్షి 1812 రకం విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం , సెల్‌ఫోన్‌తో రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ శ్రీవిద్య

కోవెలకుంట్ల: గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఏపీఓ శ్రీవిద్య సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి పథకం కార్యాలయంలో మండలంలోని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవి నేపథ్యంలో వ్యవసాయ పనులు లేనందున అడిగిన వారందరికీ పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి కూలీలకు ప్రభుత్వం రూ. 300 గరిష్ట వేతనం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో ఈసీ మగ్బుల్, టెక్నికల్ అసిస్టెంట్లు జయభారత్‌రెడ్డి, పక్కృద్దీన్, రాధాదేవి, ప్రసాదరెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న వేంకటేశ్వరస్వామి కల్యాణం

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 25న శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రెసిడెంట్, రిటైర్డ్ ఎస్‌ఐ మద్దయ్య తెలిపారు. ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నామని, భక్తులు తరలి వచ్చి దర్శించుకోవాలని కోరారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మ వారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆశీనులుగావించి పల్లకీ సేవ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించి తీర్థ ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు.

30న మండల సర్వసభ్య సమావేశం

బేతంచెర్ల: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవి ప్రసాద్ తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సర్వసభ్య సమావేశానికి తప్పక హాజరు కావాలన్నారు. ఆయా శాఖల అధికారులు తమ అభివృద్ధి నివేదికలతో పాల్గొనాలని సూచించారు.

విత్తన శుద్ధి... సాగు వృద్ధి

- తెగుళ్ల నివారణతో పాటు మొలకశాతం వృద్ధి
- వేరుపురుగు నివారణలో ప్రధానపాత్ర



విత్తనశుద్ధి చేయిస్తున్న వ్యవసాయ అధికారి (ఫైల్)

ప్యాపిలి: ఖరీఫ్ సాగుకు అన్నదాత సిద్ధం అవుతున్నాడు. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అడపాదడపా కురిసిన వర్షాలు సాగుకు సానుకూలంగా మారాయి. దీంతో రైతులు తమ పొలాల్లో వేసవి దుక్కుల పనుల్లో బిజీ అయ్యారు. అయితే సాగుకు భూసార పరీక్షలు, విత్తన శుద్ధి చాలా ముఖ్యం. విత్తన శుద్ధితో సాగు వృద్ధి చెందుతుందన్న వ్యవసాయ అధికారుల సూచనలు రైతన్నలు ఇప్పుడిప్పుడే పాటిస్తున్నారు. తెగుళ్ల బారి నుంచి పంటలు కాపాడుకునేందుకు విత్తనశుద్ధి ఎంతో దోహదపడుతుంది. వేరుకుళ్లు, నారుకుళ్లు వంటి తెగుళ్లను నివారించవచ్చును కూడా. విత్తనశుద్ధి చేయడం ద్వారా విత్తిన 40 రోజుల వరకు పంటలను ఎటువంటి చీడపీడలు ఆశించవు. తెగుళ్లు, క్రిమికీటకాల నుంచి మొక్కలు పూర్తిస్థాయిలో రక్షించబడతాయి. మొలకశాతం వృద్ధి చెందుతుంది. భూమిలో ఉండే శిలీంద్రాలు, వేరుపురుగులను నివారించవచ్చు. దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయి. మండలంలో 23 వేల హెక్టార్ల సాగుభూమి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ప్రధానంగా కందులు, ఆముదం, టమాట, వేరుశనగ, పత్తి, సజ్జ తదితర పంటలు సాగు చేసేందుకు రైతన్నలు సమాయత్తం అవుతున్నారు. వివిధ పంటలు సాగు చేసేముందు విత్తనశుద్ధి క్రింది విధంగా చేయాల్సి ఉంటుంది.

వరి: కిలో విత్తనానికి మూడు గ్రాముల కర్బండైజిమ్‌ను కలిపి 24 గంటల తరువాత నారుమడిలో చల్లుకోవాలి. దంపనారుమళ్లకు లీటరు నీటికి ఒక గ్రాము కర్బండైజిమ్‌ను కలిపి ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మండేకట్టి మొలకలను దంప నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు మందునీరు సరిపోతుంది.

మొక్కజొన్న: కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెట్ లేదా థైరం లేదా కాప్టాన్ అనే మందుతో విత్తనశుద్ధి చేసుకుంటే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు.

జొన్న: కిలో విత్తనానికి 3 గ్రాముల థైరం లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి.

వేరుశనగ: కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెట్ లేదా 1 గ్రాము కార్బండైజిమ్ పొడి మందును పట్టించాలి. వరి మాగానిలో లేదా కొత్తగా వేరుశనగ సాగుచేసేవారు విత్తనానికి రైజోబియం కల్చరుని పట్టించాలి. వేరుపురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 6.5 మిల్లీ లీటర్ల క్లోరిపైరిపాస్ లేక 2 మిల్లీ లీటర్ల ఇమిడాక్లోపిడ్ చొప్పున కలిపి శుద్ధి చేయాలి. విత్తనాన్ని మొదట క్రిమిసంహారక మందుతో శుద్ధి చేసి ఆరబెట్టిన తర్వాత అవసరమైతే రైజోబియంను కూడా విత్తనాలకు పట్టించాలి.

పొద్దుతిరుగుడు: విత్తనాలు విత్తేముందు 14 గంటలు నీటిలో నానబెట్టి తరువాత నీడలో ఆరబెట్టాలి. విత్తేముందు కిలో విత్తనానికి 2–3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ కలిపి విత్తన శుద్ధి చేయాలి. నెక్రోసిస్ తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 5 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

ఆముదం: కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కార్బండైజిమ్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి. విత్తన శుద్ధి చేయడం ద్వారా మొలక కుళ్లు తెగులు (ఫైటోప్తోరా బ్లెట్ట్), ఆల్టర్‌నేరియా, ఆకు మచ్చ తెగులు, వడలు తెగులు అరికట్టవచ్చు.

కంది: రైజోబియాన్ని విత్తనంతో కలిపి విత్తితే అధిక దిగుబడి పొందవచ్చు.

సజ్జ: కిలో విత్తనానికి 6 గ్రాముల అప్రాన్ 35 ఎస్‌డీతో విత్తనశుద్ధి చేసి పచ్చకంకి వెర్రి తెగులును నివారించవచ్చు.

మిరప: కిలో మిరప విత్తనానికి 150 గ్రాముల ట్రైసోడియం, ఆర్థోఫాస్పేట్‌తో విత్తన శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చు. 8 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్‌ను కలపడం ద్వారా రసం పీల్చే పురుగును నివారించవచ్చు. ఇతర తెగుళ్ల నివారణకు 3 గ్రాముల కాప్టాన్ లేదా 3 గ్రాముల మాంకోజెట్‌ను కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.

ఫీజు చెల్లించకున్నా పది సప్లిమెంటరీ పరీక్షలు రాయొచ్చు

కొలిమిగుండ్ల: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేది నుంచి జరుగునున్న నేపథ్యంలో ఫెయిల్ అయిన విద్యార్థులు ఫీజు కట్టకపోయినా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని రాయవచ్చని ఎంఈఓలు రాజయ్య, అబ్దుల్ కలాం చెప్పారు. ఈఏడాది నుంచి పదవ తరగతి విద్యార్థులకు సీబీఎస్‌ఈ తరహాలో నూతన పాఠ్య పుస్తకాలు రానున్నాయన్నారు. దీంతో ఫెయిల్ అయిన విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షలు రాసే వెసులుబాటును అధికారులు కల్పించారన్నారు. తల్లితండ్రులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను పరీక్షలు రాసేలా చూడాలని సూచించారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జూన్ 15వ తేదీ వరకు ప్రథమ సంవత్సరంలో వివిధ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లు చేపట్టామన్నారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులతోపాటు ఒకేషనల్, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అడ్మిషన్లు పొందాలని సూచించారు.

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చర్యలు తప్పవు



ధ్వంసమైన రోడ్డు, డ్రైనేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

డోన్ : ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన ఏ స్థాయి వ్యక్తులైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం హెచ్చరించారు. స్థానిక 17వ వార్డులో డీఈ రసూల్, టౌన్ ప్లానింగ్ అధికారి నాగరాజు, సహాయ అధికారి అంజాద్‌బాషా, ఏఈ సతీష్, కౌన్సిలర్ నాగేంద్రతో కలిసి బుధవారం కమిషనర్ కాలనీల్లో పర్యటించారు. సత్తార్ వీధిలో ఒక వ్యక్తి డ్రైనేజీతో పాటు రోడ్డును ధ్వంసం చేయడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కాల్వతోపాటు రోడ్డును వెంటనే పునర్నిర్మించాలని కమిషనర్ హెచ్చరించడంతో ఆ వ్యక్తి అంగీకరించారు. కార్యక్రమంలో నాయకులు రమణ, దస్తగిరి, పెయింటర్ మాబు, దాసు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు,



భక్తులకు భోజనం వడ్డిస్తున్న దినేష్‌గౌడ్

డోన్ : మండల పరిధిలోని యాపదిన్నె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం బుధవారం కమనీయంగా జరిగింది. స్వామి వారి జయంతోత్సవాల్లో భాగంగా వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు, అశేష జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులకు వైఎస్సార్‌సీపీ డోన్ నాయకులు రామాంజనేయులుగౌడ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీదేవి, 13వ వార్డు కౌన్సిలర్ దినేష్‌గౌడ్, ఆయన సోదరులు రఘువీర్‌గౌడ్, నాగార్జునగౌడ్ అన్నదానం చేశారు.

హోరాహోరీగా సాగిన బండలాగుడు పోటీలు

స్వామివారి జయంతోత్సవాల్లో భాగంగా నిర్వహించిన న్యూ కేటగిరి, రాష్ట్రస్థాయి బండలాగుడు ఎద్దుల పోటీలు హోరాహోరీగా సాగాయి. పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, అనంతపురం జిల్లా వరదాయిపల్లె గ్రామానికి చెందిన దస్త శ్రీరాములు, అనంతపురం జిల్లా రేగడ కొత్తూరు గ్రామానికి చెందిన భూమిరెడ్డి శేఖర్‌రెడ్డి, కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పెండేకల్ గ్రామానికి చెందిన వృషభరాజములు విజేతలుగా నిలిచాయి. వృషభాల యాజమానులకు వరుసగా రూ.35వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున గ్రామానికి చెందిన మునిగొండ మధు, సోలార్ ఫ్యాన్ కంపెనీ నరసింహారెడ్డి, హుసేన్‌పీరా, తగర మహేష్, నరసింహుడు, హనుమంతు, ఇమామున్నాలు నగదు అందజేశారు.

నరసింహస్వామి ఆలయంలో పూజలు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీ సమీపాన కొండపైన వెలసిన గట్ల నరసింహస్వామి ఆలయంలో నరసింహస్వామి జయంతి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో గాయత్రి బ్రహ్మణ సేవా సంఘం సభ్యులు మారుతి కృష్ణ, భక్తులు స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. భజన కృష్ణయ్య ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో భక్తులు జయరామిరెడ్డి, నరసింహులు, నాగ మోహన్, శ్రీనివాసులు, రమణ, నాగ మోహన్ పాల్గొన్నారు.

బుద్ధ జయంతిని విజయవంతం చేద్దాం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కోవెలకుంట్ల: స్థానిక రోటరీక్లబ్ భవనంలో గురువారం నిర్వహించే గౌతమ బుద్ధుని జయంతి వేడుకలను విజయవంతం చేద్దామని జయంతి వేడుకల కార్యచరణ కమిటీ నాయకులు రెడ్డిపల్లె ఓబయ్య, వడ్డె సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుద్ధుడి 2,548వ జయంతి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుద్ధుని జననం, జ్ఞానోదయం, మరణం వైశాఖ పౌర్ణమి రోజున జరగడంతో బుద్ధ పౌర్ణమిగా పేరుగాంచిందన్నారు. జయంతి వేడుకలకు దళిత సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము పాలెం శ్రీనివాసులు, నంద్యాలకు చెందిన ప్రముఖ న్యాయవాది శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు నరసింహులు, సుధాకర్, రాములమ్మ, వెంకటసుబ్బయ్య, మద్దిలేటి పాల్గొన్నారు.

బనగానపల్లెలో కార్డెన్‌సెర్చ్



తెలుగుపేట ప్రజలతో మాట్లాడుతున్న సీఐలు గంటా సుబ్బారావు, తిమ్మారెడ్డి



టంగుటూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బనగానపల్లె రూరల్ : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా బుధవారం సీఐలు గంటా సుబ్బారావు, తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బనగానపల్లె పట్టణంలోని తెలుగుపేట, రాంభూపాల్ నగర్ కారెడ్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానిత ఇళ్లలో సోదాలు చేశారు. ఎలాంటి పత్రాలు లేని తొమ్మిది మోటార్ సైకిళ్లతోపాటు 20లీటర్ల నాటుసారా సీజ్ చేసినట్లు సీఐలు తెలిపారు. కొత్తవారు కాలనీల్లో తిరుగుతుంటే పోలీసులకు సమాచారం అందజేయాలని వారు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రామిరెడ్డి, తిరుపాల్, కిరణ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరులో కవాతు

నందివర్గం స్టేషన్ పరిధిలోని టంగుటూరు గ్రామంలో ఎస్‌ఐ తిరుపాల్, పోలీసు సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. నాయకులు, వివిధ కేసుల్లో ఉన్న పాత రౌడీషీటర్లకు ఎస్‌ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలు ఉంటుందన్నారు. ఎలాంటి సంబరాలు, విజయోత్సవాలకు అనుమతిలేదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ప్రముఖులు



ఏపీపీసీబీ సెక్రటరీ శ్రీధర్‌కు మెమొంటో అందిస్తున్న ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సెక్రటరీ, ఐఏఎస్ శ్రీధర్, కుటుంబ సభ్యులు బుధవారం పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రాజేశ్

డోన్ రూరల్ : కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఏడీఏ పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. డోన్ పట్టణంలోని కిరణ్ హైబ్రిడ్ సీడ్స్, కోరమాండల్ ఇంటర్నేషనల్ షాపులను బుధవారం అబ్దుల్ షఫీతో కలిసి ఏడీఏ తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, బిల్లులు, సర్టిఫికెట్స్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ విత్తనాలు ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని సూచించారు. అలాగే రైతులు అడిగిన రకాలనే సరఫరా చేయాలని, నాణ్యమైన విత్తనాలను అమ్మాలని సూచించారు. ప్రతి కొనుగోలుకు సంబంధించి రైతలకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్యాపిలి: ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులు విత్తనాలను, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ రాజేశ్ హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణంలోని కామధేను, సౌజన్య ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాలలో నిల్వలను రికార్డులతో పోల్చి చూశారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. నాసిరకం విత్తనాలు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.


మృతుని కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



మృతుని భార్యకు రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ బోరెడ్డి

డోన్ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన తలారి రామచంద్రుడు కుటుంబ సభ్యులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ బోరెడ్డి, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ.5లక్షల చెక్కును బుధవారం అందజేశారు. తమ బ్యాంకులో ఖాతాదారుడై ఉండి తీసుకున్న పంట రుణానికి కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింపజేసుకోవడంతో మృతుని భార్య లక్ష్మిదేవికి రూ.5లక్షలు మంజూరైందని మేనేజర్ బోరెడ్డి అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది గోవర్దన్, మాయావతి, కేర్ కంపెనీ అధికారులు వెంకటక్రిష్ణ, రాజారావు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ మురళీ కల్యాణి

మహానంది: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, నిర్ణీత వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని నంద్యాల డీఎల్‌డీఓ మురళీ కళ్యాణి సూచించారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలోని సచివాలయం–1లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ ఏసుపాదం, సిబ్బంది మహబూబ్‌బాషా, మేఘశ్యామ్ ఆచారి, జక్రియా, అయేషా తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

కొలిమిగుండ్ల: వేసవిలో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ సామాజిక బాధ్యత కింద ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అందిస్తున్నారు. అంకిరెడ్డిపల్లె, పెట్నికోట, గొర్విమానుపల్లె గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందని ఎంపీడీఓ సాయికృష్ణ సిమెంట్ కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కంపెనీ ప్రతినిధులు మూడు గ్రామాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా కల్పిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ప్రజలకు నీటి కష్టాలు తప్పాయి.



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



పట్టణ పోలీసు స్టేషన్‌లో ఒకేషనల్ సబ్జెక్టు ప్రశ్నాపత్రాలను భద్రపరస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఈ నెల 24 తేదీ నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ కృష్ణయ్య తెలిపారు. ఉదయం 9గంటల నుండి 12 గంటల వరకు ఫస్ట్ ఇయర్, మధ్యాహ్నం 2.30 నుండి 5.30వరకు సెకెండ్ ఇయర్ విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. ఒకేషనల్ సబ్జెక్టుకు సంబంధించి పరీక్ష పత్రాలను బుధవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు.

అనాథ ఆశ్రమం, వేద పాఠశాల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కాటసాని తిరుపాలరెడ్డి

బనగానపల్లె : మండల పరిధిలోని యాగంటి క్షేత్రంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయ సమీపంలో యాగంటి బసవన్న గోశాల ఎదురుగా అనాథ ఆశ్రమం, వేదపాఠశాల నిర్మాణానికి బుధవారం వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాలరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుర్ర వెంకటేశ్వర్లు సేవా దృక్పథంతో ఆయన సొంత స్థలంలో అనాథ ఆశ్రమంతో పాటు వేదపాఠశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బండిబ్రహ్మానందరెడ్డి, గడ్డం వెంకటేశ్వరరెడ్డి, బండి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.